ఇంకెన్నాళ్లు..?

- ఇల్లందకుంట మండల కేంద్రంగా ఏర్పడి ఆరేళ్లు గడుస్తున్నా...
- అరకొర వసతులు, అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- సొంత భవనాలకు పలుమార్లు ప్రతిపాదనలు
- స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు
- చొరవ చూపాలని ఎమ్మెల్సీకి ప్రజల వేడుకోలు
- జమ్మికుంట బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లిన కౌశిక్‌రెడ్డి

ఇల్లందకుంట: ప్రజలకు పాలన మరింత చేరువ కావడానికి తెలంగాణ ప్రభుత్వం 2016లో జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఇల్లందకుంటను మండలంగా ఏర్పాటు చేసింది. మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండల కేంద్రంగా ఏర్పడి ఆరేళ్లు పూర్తయిన అభివృద్ధి మాత్రం అంతంత మాత్రమే. ఎర్రగుట్ట వద్ద సర్వే నెంబర్ 387లో 5.28 ఎకరాల భూమిని పరిశీలించి నూతన కార్యాలయాల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. 2019, 2022లో ఆలయం పక్కన ఉన్న సర్వే నెంబర్ 451లో మూడెకరాల భూమిని సర్వే చేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా నేటి వరకు ఎలాంటి పురోగతి లేదు. ఈటల రాజేందర్ మంత్రిగా ఉన్న సమయంలో మండలం, జిల్లాలో ఏకైక పెద్ద దేవాలయంగా పేరొందిన శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ అభివృద్ధి కోసం పాటుపడలేదనే విమర్శలు ఉన్నాయి.

సానుకూలంగా స్పందించిన మంత్రి

ఇటీవల జమ్మికుంటలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభలో స్థానిక ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, సమస్యలను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని సమాచారం. సత్వరం నిధులు మంజూరు చేసి నూతన కార్యాలయాలు నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని, ఎమ్మెల్సీ చొరవ తీసుకొని ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల సాకరమయ్యే విధంగా చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పక్కా భవనాలు కరువు

ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేక తహసీల్దార్ కార్యాలయం తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ టీటీడీ అతిథిగృహంలో కొనసాగుతోంది. వ్యవసాయ కార్యాలయాన్ని ఇటీవల రైతు వేదికలోకి మార్చారు. తహసీల్దార్, పోలీస్ స్టేషన్ భవనాలకు ఏళ్లుగా అద్దె చెల్లించడం లేదు. ఎంపీడీవో కార్యాలయానికి నెలకు రూ.8,000 చొప్పున అద్దె చెల్లించాలి. పలుమార్లు యజమాని అద్దె చెల్లించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేదు. సకాలంలో అద్దె చెల్లించలేదని ఇంటి యజమాని ఆఫీస్‌కు తాళం వేసిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించాలని ప్రజలు వేడుకుంటున్నారు.



టీటీడీ ఆధీనంలోని బిల్డింగ్‌లో తహసీల్దార్ కార్యాలయం

అభివృద్ధికి తోడ్పడాలి



మండలంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలి. జూనియర్ కళాశాల, ఫైర్‌స్టేషన్‌తో పాటు మండలానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు ప్రభుత్వం వెంటనే కల్పించి అభివృద్ధికి తోడ్పడాలి.

– శనిగరపు మహేశ్, ఇల్లందకుంట

ప్రతిపాదనలు పంపాం



రెండు నెలల క్రితం సమీకృత (ఇంటిగ్రేటెడ్) ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఎర్రగుట్ట వద్ద స్థలాన్ని పరిశీలించాం. మండల కేంద్రానికి దూరంగా ఉంటుందని దేవాలయం పక్కన స్థలాన్ని నిర్ధారించి అధికారులకు నివేదిక అందజేశాం.

– మాధవి ఠాకూర్, తహసీల్దార్



అద్దె ఇంట్లో ఎంపీడీవో కార్యాలయం



టీటీడీ అతిథి భవనంలో పోలీస్ స్టేషన్

క్లుప్తంగా

దమ్మక్కపేటలో కంటి వెలుగు శిబిరం



శిబిరంలో కళ్లద్దాలు అందిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధి 9వ వార్డులోని దమ్మక్క పేటలో శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులోని ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొండల్‌రెడ్డి, కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, మెడికల్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది, ఆశవర్కర్లు తదితరులు ఉన్నారు.

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని డీటీసీవో డాక్టర్ రవీందర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకూ చేసిన పరీక్షలు, ఎంత మందికి కళ్ల అద్దాలు అందజేశారనే తదితర వివరాలు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ అలేఖ్య, డాక్టర్ మైథిలి, సూపర్ వైజర్ కిషోర్, సరోజన ఏఎన్ఎం శ్యామల విజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు తెలియజేయాలి



మాట్లాడుతున్న గౌతంరెడ్డి

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నాయకులు, కార్యకర్తలు ప్రజలందరికీ తెలియజేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గౌతం రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, కోతుల బెడద, కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదన్నారు. ఉపఎన్నికల వేళ కేసీఆర్ ఆటో నగర్ పేరిట దొంగ పట్టాలు ఇచ్చారని దుయ్యబట్టారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, అధికార ప్రతినిధులు ముత్యంరావు, జెల్ల సుధాకర్, బీజేపీ ఫ్లోర్ లీడర్ పైళ్ల వెంకటరెడ్డి, నాయకులు దేవేందర్‌రావు, అనురాగ రోహిత్,రావుల వేణు,తూర్పాటి రాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న మంజుల

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమారు కుమారుడి జన్మదినం సందర్భంగా సర్పంచ్ మంద మంజుల సమ్మిరెడ్డి నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కార్యదర్శి రాజేశ్, హెచ్‌ఎం రమా, భాగ్యరేఖ, సురేష్, మురళీకృష్ణ, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

నిర్దిష్ట సమయంలో లక్ష్యం చేరుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు నిర్దిష్ట సమయంలో లక్ష్యం చేరుకోవాలని టాస్క్ ట్రైనర్ గాడిపెల్లి ఓం ప్రకాశ్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో టాస్క్ టీఎస్ సంస్థ ద్వారా విద్యార్థులకు ఉద్యోగ సాధనపై శిక్షణ కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ .. సమయపాలన, సృజనాత్మకత, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఆదర్శవంతమైన వ్యక్తుల నుంచి ప్రేరణ, స్ఫూర్తి పొందాలన్నారు. కార్యక్రమంలో టాస్క్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వీవీఎస్ హనుమకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న సీఐ

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, సీఐ ఎం. రాజ్ కుమార్ తిలకించారు. అనంతరం సీఐ మాట్లాడారు. వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మకత బయట పడుతుందని, కొత్త ప్రయోగాలతో ముందుకెళ్లాలని, చదువుల్లో రాణిస్తూ మంచి గుర్తింపు పొందాలని సూచించారు. ప్రిన్సిపాల్ అంజనేయరావు, అధ్యాపకులు శరత్, శ్రీధర్, శ్రీనివాస్, లలిత, సుదారాణి, కిరణ్, జీనత్, శైలజ, తిరుమల, కరుణ, రమేష్, మంజుల, ప్రగతి పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో స్కిబీ–23

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ శ్రీచైతన్య ఎంబీఏ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు స్కిబీ–23 పేరిట బిజినెస్ క్విజ్ కాంపిటేషన్ నిర్వహించారు. చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కాలానికి అనుగుణంగా వ్యాపారంలో చోటు చేసుకుంటున్న మార్పులను ఎలా ఎదుర్కోవాలి? కావాల్సిన నైపుణ్యం ఎలా పెంపొందించుకోవాలి అనే అంశాలపై క్విజ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్పొరేట్ అవసరాలకు ఎలా తయారుకావాలో, వస్తు ఉత్పత్తి, నాణ్యతను ఎలా పెంపొందించాలి దానికి కావాల్సిన నైపుణ్యాలు ఎలా పెంచుకోవాలో వివరించారు. ఎంబీఏ హెచ్‌వోడీ హరీశ్, ప్రోగ్రాం కన్వీనర్ సందీప్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు. విజేతలకు కళాశాల చైర్మన్ బహుమతులు అందజేశారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



జమ్మికుంటలో ధర్నా చేస్తున్న నాయకులు



చిగురుమామిడిలో..

చిగురుమామిడి: మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన నిరుపేదలు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సీఎం కేసీఆర్ ఎనిమిదేళ్ల పాలనలో ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని, చిన్నముల్కనూర్‌లో మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేశారని మిగతా గ్రామాల్లో నిరుపేదలు లేరా అని ప్రశ్నించారు. అనంతరం వ్యక్తిగత దరఖాస్తులు సమర్పించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: ప్రభుత్వం పేదలకు డబులు బెడ్‌రూం ఇండ్లు అందించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పేదలందరికి డుబల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇంటి స్థలాలు మంజురు చేయాలని డిమాండ్ చేశారు. నిర్మించిన ఇండ్లు ఆక్రమించుకుంటామని హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశంలో పేదల ఇండ్ల కోసం ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ప్రభుత్వాని తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రాములు, కేవీపీఎస్ కిషోర్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు రాజకుమారి, నాయకులు, పాల్గొన్నారు.

హుజూరాబాద్: నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ఐక్య వేదిక (సీఐటీయూ, ఏఐడీడబ్ల్యూ,డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 9న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి కోరారు. నిరసనలో నాయకులు రమేష్, వాసుదేవ్, రాములు,తూముల కుమార్, ఎండి అజ్జు,ప్రతాప శ్రీనివాస్, కొంకట చంద్రయ్య,రామయ్య,లింగాల సంపత్,రాచపల్లి రఘు, కొమ్ముల రవి,తంగేళ్ల రమేష్ ఉన్నారు.

యువ రైతులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న యువ రైతులు

చొప్పదండి: కార్నర్ సద్గురు ఫౌండేషన్, పొలాస అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలతో పాటుగా మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో శుక్రవారం యువరైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పెద్దకుర్మపల్లి గ్రామానికి చెందిన జాతీయ ఉత్తమ రైతు అవార్డు గ్రహీత మావురం మల్లికార్జున్‌రెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో చేస్తున్న వ్యవసాయ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రజనీకాంత్, మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ, ఏఈవో రాజశేఖర్ రైతులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సై, క్లబ్ సభ్యులు

హుజూరాబాద్: అలయన్స్ క్లబ్ పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. ఎస్ఐ రాజన్న ముఖ్య అతిథిగా హాజరై అలయన్స్ క్లబ్ పుస్తకం ఆవిష్కరించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. భవిష్యత్తులో మెరుగైన సేవలందించాలని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బి.మనోజ్, రామలింగారెడ్డి, తూమ వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి మాధవ రావు, కోశాధికారి బండ సంపత్‌రెడ్డి, నిర్వాహకులు శ్రీహరి,శివప్రసాద్‌రావు, రావుల తిరుపతిరెడ్డి, ముక్కెర కన్నయ్య, పసుల స్వామి, ఆకుల సమ్మయ్య తదితరులు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

రామడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2012–13 పదో తరగతి విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకచోట చేరి చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.



నియామకం

రైతుబంధు సమితి చిగురుమామిడి మండల కో ఆర్డినేటర్‌గా తిరుపతి



బాధ్యతలు స్వీకరిస్తున్న తిరుపతి

చిగురుమామిడి: చిగురుమామిడి మండల రైతు బంధు సమితి కో ఆర్డినేటర్‌గా పెనుకుల తిరుపతిని నియమిస్తూ హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం మండల వ్యవసాయాధికార్యాలయంలో ఏఓ రంజిత్‌కుమార్ సమక్షంలో తిరుపతి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయనను పలువురు సన్మానించారు. రైతు సమన్వయసమితి జిల్లా కమిటీ సభ్యుడు కొంరయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజయ్య, జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రచార కార్యదర్శి రాంబాబు, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి సదానందం, నాయకులు, ఏఈఓ ఫరీద్ తదితరులున్నారు. తిరుపతి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి



సంతకాల సేకరణలో బీఎస్పీ నాయకులు

గంగాధర: బీసీలకు చట్ట సభల్లో 52 శాతం రిజర్వేషన్లు పెంచాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి నల్లాల రాజేందర్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు పెంపుచేయాలని చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం గంగాధర మండలంలో నిర్వహించారు. దేశంలో జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ అమలు చేయాలని, బీసీ జనగణన చేయాలన్నారు. బీసీల కోసం పోరాడుతున్నది బీఎస్పీ ఒక్కటేనని అన్నారు. నాయకులు బాలకిషన్, మంద రవీందర్, కొంకటి శేఖర్, కాంపెల్లి రాజు, బండపెల్లి శ్రీకాంత్, తిరుపతి, వేల్పుల అనూష, పొత్తూరి సురేష్, దుర్గయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వీణవంక: మా ఇంటి కానుకలో భాగంగా ఇటీవల వివాహమైన దంపతులకు, మృతిచెందినవారి కుటుంబ సభ్యులకు వీణవంకకు చెందిన ట్యూరిటో, యుప్ టీవీ సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. ఐదువేల చొప్పున నగదును అనుచరులు అందజేశారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



జమ్మికుంట: మొక్కలు నాటుతున్న ఎంపీపీ



శంకరపట్నం: అర్కండ్లలో...

జమ్మికుంట: ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తుందని, రైతులు సాగుతో లాభాలు పొందవచ్చాని ఎంపీపీ దొడ్డె మమతప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దంపల్లిలో రైతు మండ వెంకటరాజం వ్యవసాయ భూమిలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. సబ్సిడీ, డ్రిప్‌సౌకర్యం, మూడేళ్ల వరకు నిర్వహణ ఖర్చులు అందజేస్తుందన్నారు. అంతర పంటలకు వీలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, పెద్దంపల్లి సర్పంచ్ ఇల్లందుల అన్నపూర్ణరామరాజు, జగ్గయ్యపల్లి సర్పంచ్ వంశీధర్‌రావు,మాచనపల్లి ఎంపీటీసీ రాజురావు, ఏఈవో లక్ష్మణ, హార్టికల్చర్ ఆఫీసర్ ఐలయ్య, ఫీల్డ్ ఆఫీసర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: ఆయిల్‌పామ్‌తో లాభాలు ఆర్జించవచ్చని ఏఈవో రాకేశ్ రైతులకు సూచించారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో రైతు మాడ ఉమాసమ్మిరెడ్డి భూమిలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఎకరాకు 57మొక్కలు అవసరమని, సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాడ విజయేందర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్‌లు చెక్కబండి శ్రీనివాస్‌రెడ్డి, కట్కూరి మధుసూదన్‌రెడ్డి, రైతులు శివారెడ్డి, పాపిరెడ్డి, వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల గ్రామానికి చెందిన చింతిరెడ్డి మధుకర్‌రెడ్డి భూమిలో అధికారులు ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. రైతులు వరిసాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి మంజువాణి, ఏఈవో లక్ష్మీప్రసూన, సర్పంచ్ రవి, మాజీ వైస్‌ఎంపీపీ ఎల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వారసంత ప్రారంభం



సంతను ప్రారంభిస్తున్న నీలకుమార్

వీణవంక: మండల కేంద్రంలో వారసంతను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నీల కుమార్ తెలిపారు. శుక్రవారం సంతను ప్రారంభించి మాట్లాడారు. ప్రతివారం మండల కేంద్రంలో సంత జరుగుతుందని, అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పశువులు, కూరగాయలు, ఇతర సామగ్రి సంతలో లభ్యమవుతాయని తెలిపారు. ప్రతి మంగళవారం జమ్మికుంట వారసంతకు వెళ్లే ఇబ్బంది తప్పిందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ గంగాడి తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ ఓరెం భానుచందర్, మహేశ్‌గౌడ్, పున్నంచందర్, రాయిశెట్టి సంపత్, క్రాంతి, కృష్ణచైతన్య తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



వీణవంక: శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులకు సహకరించాలని జమ్మికుంట రూరల్ సీఐ సురేశ్ అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం ఎస్సై శేఖర్‌రెడ్డితో కలిసి వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలకు నంబర్ ప్లేట్ కనిపించే విధంగా లేకుంటే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం వేసుకోవాలని, పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు.

హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

శంకరపట్నం: హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆరోపించారు. కేశవపట్నంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులు, కూలీలకు నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. నిరుద్యోగభృతి ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం యువతను మోసం చేసిందని, రుణమాఫీ, ఆసరా, రేషన్‌కార్డుల ఊసే లేదన్నారు. దళితబంధు పూర్తి స్థాయిలో అమలు కావడంలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, శ్రీనివాస్, రవీందర్, కుమార్, వెంకటయ్య, రవి, సదానందం పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

చొప్పదండి: మండలంలోని మంగళపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి శుక్రవారం వేదపండితులు, గ్రామస్తులు భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి 12 గుంట స్థలం , రూ. ఐదు లక్షల విరాళం అందజేసిన వారిని ఘనంగా సన్మానించారు. సహకార సంఘం చైర్మన్ మల్లారెడ్డి, సర్పంచ్ వెల్మ నాగిరెడ్డి, ఎంపీటీసీ విజయలక్ష్మి, ఏనుగు రవీందర్‌రెడ్డిలతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

అట్టహాసంగా బ్రహ్మోత్సవాలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం పద్మగోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శేష వాహనంపై ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు పలువురు ప్రజాప్రతినిధులు, తదితరులు వేడుకలో పాల్గొన్నారు.

దేవాలయం నిర్మాణానికి విరాళం

రామడుగు: మండలంలోని చిప్పకుర్తి–రాంచెంద్రాపూర్ గ్రామ పరిధిలో నిరిస్తున్న ఎల్లమ్మ ఆలయానికి ఎంపీటీసీ సంఘం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి రూ. 10,116లు దేవాలయాభివృద్ధి కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులుప్రభాకర్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ భూమిపూజ చేశారు. మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం ఆవరణలో ధ్వజస్తంభ పున:ప్రతిష్ఠాపనమహోత్సవం, స్వామివారి కల్యాణోత్సవం వై భవంగా నిర్వహించారు. తహసీల్దార్ రాజుకుమార్,ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, సర్పంచ్ ప్రమీలజగన్‌మోహన్‌గౌడ్, గ్రామస్తులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



హుజూరాబాద్‌రూరల్: ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



రామడుగు: భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి బ్రహ్మో త్సవాలు పురస్కరించుకుని భక్తులు గుట్ట కింద పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. గుట్టపై కొలువుదీరిన మత్స్యగిరీంద్రస్వామి, నర్సింహాస్వామి, ఆంజనేయస్వామి, శివాలయంలో పూజలు, అర్చనలు చేశారు. చైర్మన్ మల్హర్రావు, సర్పంచ్ కిషన్‌రావు,ఈవో సుధాకర్, ధర్మకర్తలు,భక్తులు పాల్గొన్నారు.